క్లుప్తంగా

హత్య కేసు విచారణలో పారదర్శకత పాటించాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ప్రశాంతతకు మారుపేరు అయిన రాయదుర్గం నియోజకవర్గంలోని మెచ్చిరిలో ఇటీవల హత్య ఘటన వెలుగుచూడటం విచారకరమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. హత్య కేసు విచారణను పాదర్శకంగా చేపట్టాలని ఆయన కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ హత్య కేసులో నిందితులను గుర్తించి, కఠినంగా శిక్షించాలన్నారు. అయితే కేసుతో సంబంధంలేని అమాయకులను ఇరికించే ప్రయత్నం చేయొద్దని పోలీసులను కోరారు. కొందరిపై అనవసరంగా ఒత్తిడి తీసుకొస్తూ భయభ్రాంతులకు గురిచేయడం మంచిది కాదన్నారు. లోతుగా దర్యాప్తు చేపట్టి దోషులుగా తేలిన వారిని మాత్రమే శిక్షించాలన్నారు. రాజ్యాంగం అన్నా, రాజ్యాంగ వ్యవస్థలన్నా తనకు అపార గౌరవం, నమ్మకం ఉందన్నారు. ఇలాంటి విషయాల్లో రాజకీయాలకు తావివ్వకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అన్ని కోణాల్లోనూ విచారించి దోషులను మాత్రమే గుర్తిస్తే, వ్యవస్థల పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

వజ్రకరూరు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని సర్పంచు మోనాలిసా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని బాలికల హాస్టల్‌కు సర్పంచు ఇన్‌సినరేటర్ అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, పంచాయతీవార్డు సభ్యుడు అచ్చనాల మధుసూదన్, గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు సహకరించండి



కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజా అన్నారు. శనివారం మండలంలోని కృష్ణాపురంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను పరిశీలించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఎర్రమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

బొమ్మనహాళ్: ఆధార్ కార్డులను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అప్‌డెట్ చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ ప్రత్యేక క్యాంపులు ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 23న బొమ్మనహాళ్ (జూనియర్ కాలేజీ) గోనేహాళ్, డి.హొన్నూరు-1, నేమకల్లు గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న శ్రీధరఘట్ట, డి.హొన్నూరు-2, బొమ్మనహాళ్ (జెడ్పీ హైస్కూల్), కురువల్లి, 25న లింగదహాళ్, ఉద్దేహాళ్,శ్రీధరఘట్ట, 26న గోవిందవాడ-1, బొల్లనగుడ్డం, బండూరు, ఎఠంజి, 27న ఉంతకల్లు, కల్లుహోళ, గోవిందవాడ-2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు


అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్న అధికారులు

కంబదూరు: మండల కేంద్రంలోని లక్ష్మీదేవమ్మ విగ్రహం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. శనివారం పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, మండల సర్వేయర్ మణికంఠ, ఆర్‌అండ్‌బీ జేఈ గోవిందరాజు అక్రమ నిర్మాణాలను గుర్తించి, రెడ్ మార్కులు వేశారు. త్వరలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు అందజేసి, తొలగింపునకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు సౌమ్య, చందన, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రకాష్, వెల్ఫేర్ అసిస్టెంట్ శాంతి, మహిళా పోలీసు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

22న ఉచిత కంటి వైద్య శిబిరం

కూడేరు: ఈ నెల 22న మండల కేంద్రం కూడేరులోని వివేకానంద స్కూల్‌లో పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు శనివారం తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ కూడా చేయిస్తామని ఆయన తెలిపారు.

భక్తకోటి ఆరాధ్యుడు.. భీమ లింగేశ్వరుడు

- నేటి నుంచి భీమలింగేశ్వరస్వామి ఉత్సవాలు
- ప్రతి ఇంటా భీమలింగేశ్వర నామకరణం ఇక్కడి ఆనవాయితీ
- నైవేద్యంగా మద్యం, మాంసం పెడుతున్న భక్తులు


గడేకల్లులోని భీమలింగేశ్వరస్వామి ఆలయం


భీమలింగేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

విడపనకల్లు: అఖిల లోక పాలక సుశక్తి సంపన్నులు వేములవాడ భీమలింగేశ్వరస్వామి. నిత్య బ్రహ్మచారిగా ఆయన తొలి దశలో కవీశ్వరుడిగా ప్రాశస్త్యం గడించారు. మలిదశలో అనేక మఠాలు స్థాపించి తన మహిమలు చూపుతూ దైవాంశ సంభూతులుగా భక్త కోటి ఆరాధ్య దైవంగా నిలిచారు. మండలంలో గడేకల్లు గ్రామంలో 101వ శక్తిమఠం స్థాపించి ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజున జీవ సమాధి అయ్యారు. ఇందులో భాగంగానే యేటా ఆషాఢ మాసంలో గడేకల్లులో పెద్ద ఎత్తున వేములవాడ భీమలింగేశ్వరస్వామి మహా రథోత్సవం జరుగుతుంది.

23 వరకు రథోత్సవం..

ఏటా ఆషాడ మాసంలో జూలై నెల రెండోవారం లేదా మూడోవారంలో (జూలై 20 నుంచి 23 వరకు) భీమలింగేశ్వరస్వామి రథోత్సవం జరుగుతుంది. 20న హంచనహల్ నుంచి గడేకల్లు వరకు అడ్డ పల్లకిలో భీమలింగేశ్వరస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తారు. 21న బిందేసేవ, 22న రథోత్సవాలపై కళస ప్రతిష్ఠి, 23న సాయంత్రం భీమలిగేశ్వస్వామి మహారథోత్సవం జరగనుంది. ఈ వేడుకలకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. భీమలింగేశ్వర స్వామిని ఇలవేల్పుగా కొలిచే భక్తులు వేలాదిగా తరలివస్తారు. గడేకల్లు గ్రామంలో ప్రతి ఇంట్లో భీమలింగేశ్వరస్వామి పేరుతో కలుపుకొని గ్రామంలో చాలా మంది స్త్రీలు, పురుషులు భీమ్ రెడ్డి, భీమలింగ చౌదరి, భీమప్ప, భీమక్క, భీమేష్, భీమలింగ, భీమలింగప్ప, భీంశేఖర్, భీమా భీంరావు, ఇలా అనేక రకాలుగా స్వామి పేర్లను పెట్టుకున్నారు. భీమలింగేశ్వరస్వామి పేరు పెట్టుకోవడం వల్ల ఆ వ్యక్తికి బతికున్నంత కాలం మంచి జరుగుతుందని వారి విశ్వాసం.

మద్యం, మాంసం నైవేద్యంగా ఎందుకు పెడతారంటే.. :

భీమలింగేశ్వరస్వామి దేశాటన చేస్తూ గడేకల్లు గ్రామానికి చేరుకున్న సమయంలో చాబాలకు చెందిన సంజమ్మ అవ్వ స్వామి భక్తురాలు. ఆమె స్వామికి విశేష పూజలు చేస్తుండేది. ఒక రోజు సంజమ్మ అవ్వకు భీమలింగేశ్వరస్వామి తాను ఇక్కడే జీవ సమాధి అవుతా ను.. నైవేద్యంగా ఏం పెడుతావని అడిగారు. నైవేద్యం పెట్టడానికి మాంసం, సారా తప్పా ఏమీ లేదని సంజ మ్మ అవ్వ చెప్పింది. సరే.. నాకు మాంసం, సారా నైవేద్యంగా పెట్టి పూజలు చేయి.. నీకోర్కెలు తీరుస్తానని స్వామి చెప్పాడట. దీంతో యేటా ఆలయంలో భక్తులు స్వామికి మాంసం, సారా నైవేద్యంగా పెట్టి పూజలు చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నారు.


భీమలింగేశ్వరస్వామి

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు


మాట్లాడుతున్న సెబ్ సీఐ కిశోర్‌కుమార్

ఉరవకొండ: జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిస కావొద్దని ఉరవకొండ సెబ్ సీఐ కిశోర్‌కుమార్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాలు, యువత, విద్యార్థి జీవితాలు చిత్తు అనే అంశంపై సెబ్ అధికారులు అవగాహన సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐ కిశోర్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు


సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కుందుర్పి: మండల వ్యాప్తంగా 2023 మార్చి నెల నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. రూ 8.44 కోట్లతో వివిధ పనులు చేపట్టగా, శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీలో 13 గ్రామ పంచాయతీల నుంచి రూ. 2.10 లక్షలు అవినీతి జరిగినట్లు అధికార్లు తేల్చినట్లు తెలిపారు. తెనగల్లు, ఎర్రగుంట,కుందుర్పి, మలయనూరు, రామంతపురం తదితర పంచాయతీల్లో ఎక్కువగా ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, డీవీఓ పరవీశ, డీఆర్‌డీఏ అధికారి జిలాన్ , ఏపీడీ రమేష్ నాయక్, ఈసీ వలీ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


సర్పంచ్ అనంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తలారి రంగయ్య


గొల్ల గ్రామంలో మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న తలారి రంగయ్య

- అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య

గుమ్మఘట్ట: కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. ఇటీవల మండలంలోని గొల్లపల్లి గ్రామ సర్పంచ్ గౌని అనంతమ్మ మృతిచెందిన విషయం విదితమే. కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ రంగయ్య శనివారం రాత్రి ఆయన పరామర్శించారు. అనంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌని అనంతమ్మ మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడుతూ ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంతో ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని గోళ్ల గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డిని అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య శనివారం పరామర్శించారు. మోహన్‌రెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. దీంతో ఆయన్ను తలారి రంగయ్య పరామర్శించారు. నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

అమ్మ కోసం చెట్టు నాటుదాం


పిల్లలపల్లిలో మొక్క నాటుతున్న దృశ్యం


గూబనపల్లిలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

బ్రహ్మసముద్రం : మండలంలోని పిల్లలపల్లి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మకోసం అమ్మ పేరున ఒక మొక్క నాటు దాం అనే కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయం , విలేజ్ హెల్త్ క్లినిక్ ఆవరణలో సచివాలయ ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి సుబ్రమణ్యం, వీఆర్వో మర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి కవిత, ఏఎస్ఎం నల్లక్క, సచివాలయ సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

కణేకల్లు: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంఈఓ-2 భవానీశంకర్ పేర్కొన్నారు.శనివారం మండలంలోని కళేకుర్తి, కె.కొత్తపల్లి, సొల్లాపురం, ఎన్.హనుమాపురం పాఠశాలలో అనంత వన మహోత్సవం కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విరివిగా మొక్కలను నాటారు. కళేకుర్తిలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ-2 పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాజేష్, హెచ్ఎంలు నాగరాజు, రవీంద్రనాథ్, చంద్రశేఖర్, ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.


కళేకుర్తిలో మొక్కలను నాటుతున్న ఎంఈఓ-2 భవానీశంకర్, ఉపాధ్యాయులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు నాటాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. శనివారం మండలంలోని గూబనపల్లి, విటలంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ లక్ష్మీప్రసన్న సందర్శించారు. మెనూ ప్రకారం పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడిని హత్యచేయడం దారుణం


మాట్లాడుతున్న దివ్యాంగుల జేఏసీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: విశాఖ జిల్లాలోని గాజువాకలో దివ్యాంగుడిని నడిరోడ్డుపై హత్య చేయడం దారుణమని దివ్యాంగుల జేఏసీ నాయకులు ఖండించారు. శనివారం స్థానిక ఆర్ఆడ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కళ్యాణదుర్గంలోని వికలాంగుల జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి హత్యా రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల జేఏసీ నాయకులు ఉద్దీప్ సింహ, వసంత్, రాజేష్, మల్లాపురం దొణస్వామి, పాతలింగప్ప, నాగరాజు పాల్గొన్నారు.

దుద్దేకుంటలో ఘనంగా జలధి


పెన్నానది వద్ద జలధి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

బెళుగుప్ప: మండల పరిధిలోని దుద్దేకుంటలో ఆంజనేయస్వామి, దుగ్గెమ్మ ఆలయాల్లో ఘనంగా జలధి పూజ శనివారం నిర్వహించారు. ఏటా ఆషాడ మాస శనివారాల్లో జలధి పూజ నిర్వహించడం ఆనవాయితీ. పెన్నానది పరీవాహకం వద్ద గంగపూజ నిర్వహించి, కలశాలతో జలాన్ని తీసుకొచ్చి ఆలయాల్లో మూలవిరాట్‌లకు అభిషేకం చేశారు. అనంతరం ఆలయం వద్ద అర్చకులు భవిష్యవాణిని వినిపించారు.


పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

గెనిగెరలో మొహర్రం

కణేకల్లు: మండలంలోని గెనిగెర గ్రామంలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా జరగాయి. ఐదు రోజుల క్రితం పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లను నూతన వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించి, గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పీర్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పీర్లను ఎత్తుకొని అగ్నిగుండంలోకి నడిచారు.

ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేయండి

విడపనకల్లు: ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కొండయ్య పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు దస్తగిరయ్య,విడపనకల్లు, పెద్దకొట్టాలపల్లి, పాల్తూరు, పీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు రాజేంద్ర, శ్రీకాంత్, అరుణకుమారి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

విడపనకల్లు పీహెచ్‌సి ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ శనివారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ పుష్ప, ఆరోగ్య సిబ్బంది కలిసి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, సీజనల్ వ్యాధుల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


విడపనకల్లులో పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుమ్మఘట్ట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సందేశ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బీటీపీ గ్రామంలో ఉన్న కేజీబీవీలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులు , కుష్టు వ్యాధి లక్షణాలు, విరేచనాలు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమలవల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మురళీధర్, ప్రిన్సిపాల్ హసీనాబాను, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ గౌరమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయి నాథుడి ఊరేగింపు


కూడేరు:షిర్డీ సాయినాథుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైన సాయిబాబా ఆలయం

కూడేరు: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన షిర్డీ సాయి బాబా ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో షిర్డీ సాయి నాథుడి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా సాయి భక్తులు, ట్రస్టు సభ్యులు షిర్డీ సాయినాథుని పాటలను పాడుతూ ముందుకు సాగారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఆలయంలో సాయినాథునికి సామూహిక అభిషేకం , 9 గంటలకు నవగ్రహ, మృత్యుంజయ, దత్తాత్రేయ, విష్ణు సహస్రనామ హోమాలు ఉంటాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈనెల 21న గురుపౌర్ణమి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం 6:30 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయన్నారు. కాగడాహారతి, సాయి వ్రతం, మహాగణపతి, ఆదిత్యాధి నవగ్రహ సహిత దత్త మూలమంత్ర హోమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ప్రసాద వినియోగం, సాయంత్రం సాయిబాబా చిత్రపటం ఊరేగింపు ఉంటుందన్నారు.

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలు జరుగనున్నాయి. గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. షిర్డీసాయిబాబా సేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం కాగడా హారతి, సాయినాథ స్వామికి, పరిగణదేవతా మూర్తులకు వేద మంత్రాలతో ఫల పంచా మృతాభిషేకం, నైవేద్యం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9 గంటలకు సా మూహిక సత్య నారాయణస్వామి వ్రతాలు జరుగుతాయని, 12 గంటలకు మధ్యాహ్నహారతి, నారాయణసేవ (అన్నదానం) తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రథోత్సవం,అనంతరం సంధ్యాహారతి, తీర్థప్రసాద వినియోగం, పల్లకీసేవ, శేజ్ హారతి, పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ముస్తాబైన నక్కలపల్లి షిర్డీసాయి ఆలయం

బెళుగుప్ప: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ముస్తాబు చేశారు. గురుపౌర్ణమి వేడుక సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచే కాగడా హారతి, గణపతిపూజ, సాయిదునిపూజ, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర, పుష్పార్చన, మంత్రపుష్పం, తదనంతరం మహామంగళ హారతి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 12 గంటలకు మధ్యాహ్న హారతి పూజలు కొనసాగనున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుంది.

జేఎస్‌డీ, డీడీఈఓ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ (జేఎస్‌డీ), డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 25లోపు కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఎంబీఏ, ఎంకామ్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ కోసం సెల్: 9182920381లో సంప్రదించాలని కోరారు.

ప్రారంభమైన సీఏటీసీ-3 ఎన్‌సీసీ శిక్షణ

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ-3 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. క్యాంప్ కమాండర్ కల్నల్ బీఎస్ ప్రసాద్ మాట్లాడారు. ఈ శిక్షణతరగతులు ఈ నెల 27 వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో నంద్యాల, సత్యసాయి, కర్నూల్, అనంతపురం జిల్లాకు చెందిన 570 మంది క్యాడెట్లు , ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ క్యాంప్

శెట్టూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ క్యాంప్‌లు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ రఘురామరావు తెలిపారు. ఈనెల 23 నుంచి 27 వరకు సచివాలయాల్లో ఆధార్ సేవలు ఉంటాయన్నారు. 23న లక్ష్మంపల్లి, కైరేవు-1, 24న ములకలేడు, కైరేవు-2, 25న తిప్పనపల్లి, యాటకల్లు-1, 26న పెరుగుపాళ్యం, బచ్చేహళ్లి, 27న కనుకూరు, చింతర్లపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్ ఉంటాదన్నారు.

ఉపాధి శిక్షణ సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఈనెల 22 నుంచి శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌కుమార్ శనివారం తెలియజేశారు. వివరాలకు సెల్: 9440661900, 9490716015లో సంప్రదించాలన్నారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

గడ్డి జొన్న విత్తనాల పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు గడ్డి జొన్నలను పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ శ్రీనివాసులు గుప్త తెలిపారు. శనివారం ముద్దినాయన పల్లి, గోళ్ల, పాల్వాయి గ్రామాల్లో 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ప్రతి రైతుకూ గరిష్టంగా 20 కేజీల ఇస్తామన్నారు. ఆసక్తి గల రైతులు వారి ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్‌తో సమీపంలో పశువైద్య శాలలోగానీ, రైతు సేవా కేంద్రాల్లోగానీ సంప్రదించాలన్నారు.

నీటి శుద్ధత పరిశీలన

శెట్టూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో తాగునీటి శుద్ధత, లవణాలను పరిశీలించారు. శనివారం శెట్టూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వ్యాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మనోహర్ తాగునీటి శుద్ధత స్థాయిని పరిశీలించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిసెంట్ నాగరాజు, మహిళా పోలీసు బేబి పాల్గొన్నారు.